

చేయూతనందించరూ!
ఆర్మూర్‌కు చెందిన భానుప్రసాద్, మహేశ్ అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు నేపాల్ వెళ్లడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు.
- 8లో ▸



ఆరోగ్యవంత సమాజమే లక్ష్యం
ఆరోగ్యవంత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.6 /24.7
ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్


అర్హుల జాబితా విడుదల
నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిన సర్వ శిక్ష అభియాన్‌లో నియమించే అభ్యర్థుల అర్హుల జాబితాను జిల్లా కార్యాలయంలో ప్రదర్శించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఏమైనా సందేహాలుంటే అభ్యర్థులు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బడి సీజ్ చేసినా నడిపించారు
నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్‌లోని సుభాష్‌నగర్‌లో గల లిబర్టీ పాఠశాలను రెండు రోజుల క్రితం జిల్లా విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. అయినా కూడా బుధవారం పాఠశాల కొనసాగుతుందని సమాచారం రావడంతో అధికారులు పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలను మళ్లీ సీజ్ చేశారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో బడిపై ఫిర్యాదు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వేరే బడిలో సర్దుబాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంఈవోను డీఈవో దుర్గాప్రసాద్ ఆదేశించారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 9న అర్హత పరీక్ష
నిజామాబాద్‌అర్బన్: సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 9న పరీక్ష ఉంటుందని ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

'ఇంటింటా ఇన్నోవేటర్' కరపత్రాలు ఆవిష్కరణ


నిజామాబాద్ అర్బన్: ఆవిష్కరణలు, సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఔత్సాహికులు తమ ఆవిష్కరణకు సంబంధించిన ఆరు వాక్యాలు, రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణ ఫొటోలు, వివరాలు 9100678543 నంబర్‌కు ఆగస్టు 5లోగా వాట్సాప్ చేయాలని సూచించారు. ఎంపికైన ఆవిష్కరలను స్వాతంత్ర్య దినోత్సవం రోజు కలెక్టరేట్‌లో ప్రదర్శిస్తారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి


డిచ్‌పల్లి: ఎంటర్‌ప్రైజెస్ యూనిట్ల ద్వారా సుమారు 70 రకాల వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని డీఆర్‌డీవో చందర్ నాయక్ అన్నారు. బుధవారం డిచ్‌పల్లి ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.1,032 కోట్లు సాధించడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. సబ్సిడీ రుణాలు పొంది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. త్వరలోనే జిల్లా సమాఖ్య ద్వారా కూడా యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీడీ మధుసూదన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు విప్లవకుమారి, వనిత, లక్ష్మి, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, రాచయ్య, మారుతి, ఏపీఎంలు సరోజని, గంగాధర్ పాల్గొన్నారు.


డొంకేశ్వర్ మండలం చిన్నయానంలో పసుపు విత్తనాలు వేస్తున్న కూలీలు

తల్లి పంటకు దూరం


■ ఈ ఫొటోలోని రైతు పేరు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ధర్పల్లి మండలం మైలారం గ్రామం. ఒకప్పుడు నాలుగెకరాల వరకు పసుపు పంటను సాగు చేసేవాడు. మార్కెట్‌లో పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడంతో ప్రస్తుతం రెండున్నర ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నాడు. పెరిగిన ధరలకు అనుగుణంగా పంటకు కూడా క్వింటాలుకు రూ.10 వేల ధర ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా గిట్టుబాటు ధర లేకపోతే వచ్చే ఏడాది సాగు చేసే ఆలోచన ఉండకపోవచ్చని అంటున్నాడు.


■ ఈ ఫొటోలోని రైతు పేరు దేగాం గంగారెడ్డి, డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామం. మూడేళ్ల క్రితం నాలుగెకరాల్లో పసుపును సాగు చేసేవాడు. పంటకు ధర రాకపోవడంతో లాభం లేదనుకుని రెండేళ్లుగా మక్క, సోయా, ఆయిల్‌పాం పంటలను సాగు చేస్తున్నాడు. మంచి ధర వస్తేనే మళ్లీ పసుపు వేయాలన్న ఆలోచన రాదని చెప్తున్నాడు.

- నగానికి పడిపోయిన పసుపు సాగు
- ప్రతి ఏటా తగ్గుతున్న విస్తీర్ణం
- ఒకప్పుడు 50 వేల ఎకరాలకు మించి పండించేవారు..
- ప్రస్తుతం 25 వేల ఎకరాలు కూడా దాటని పరిస్థితి
- మార్కెట్‌లో లభించని గిట్టుబాటు ధర, పెరిగిన పెట్టుబడి ఖర్చులే కారణం

డొంకేశ్వర్ (ఆర్మూర్): పసుపు పంటను అత్యధికంగా సాగు చేసే జిల్లాల్లో నిజామాబాద్ ఒకటి. తల్లి పంటగా భావించే ఈ పచ్చ బంగారాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున సాగు చేసే రైతులున్నారు. అయితే ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం పసుపు పంట వేయాలంటేనే రైతులు సంకోచిస్తున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాకపోవడం, పంట పెట్టుబడికి ఖర్చులు పెరగడంతో సాగు చేయడానికి రైతులు పెద్దగా ముందుకు రావడం లేదు. దీంతో జిల్లాలో పసుపు పంట విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. గత ఐదేళ్ల పరిస్థితిని పరిశీలిస్తే సాగు సగానికి తగ్గింది. పోయిన ఏడాదైతే సాగు విస్తీర్ణం మరింత క్షీణించింది. ఐదారేళ్ల కిందట జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల వరకు పంట సాగయ్యేది. క్రమేపీ 20 వేల నుంచి 25 వేల ఎకరాలకు పరిమితమైంది. ప్రస్తుత ఏడాదైతే 23,722 ఎకరాల్లో సాగవుతుందని ఉద్యాన శాఖ అంచనా వేయగా, ఇప్పటి వరకు 15 వేల ఎకరాల్లో మాత్రమే పసుపు విత్తనాలు వేశారు. విత్తనాలు విత్తేందుకు మరో వారం రోజులే అవకాశం ఉండడంతో సాగు విస్తీర్ణం పెద్దగా పెరిగేలా కనిపించడం లేదు.


పసుపు పంట (ఫైల్)

పంట పరిస్థితిని చూసి...

పసుపు ఎనిమిది నెలలు పండే దీర్ఘకాలిక పంట. ఎకరం భూమిలో ఈ పంటను సాగు చేయడానికి రైతులకు గతంలో పెట్టుబడి ఖర్చులు అంతగా ఉండేది కాదు. మార్కెట్‌లో ధర కూడా పర్వాలేదనే స్థాయిలో ఉండేది. గత రెండు, మూడేళ్లుగా గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా సహజ ఎరువుల ధర (ఒక టారాస్ లారీ) రూ.30 వేల వరకు ఉంది. దుక్కిదున్ని విత్తనాలు వేసేందుకు, అలాగే చేతికొచ్చిన పంటను తీసి బాయిలర్లలో ఉడికించి ఎండబెట్టే వరకు కూలీలకు ఖర్చు పెద్దగానే ఉంటుంది. మొత్తంగా ఒక ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అవుతోంది. వాతావరణం సహకరించకపోతే దుంపకుళ్లు లాంటి తెగుళ్ల ఆశించి దిగుబడి తగ్గుతోంది. ఎకరానికి 20 క్వింటాళ్లు వస్తే చాలన్న పరిస్థితి నెలకొంది. ఈ విధంగా పసుపు రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. దీంతో పసుపునకు బదులు ఏడాదిలో రెండు పంటలు తీసే వాటివైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పసుపు స్థానంలో చాలా మంది ఆయిల్‌పాం, మక్క, సోయా పంటలను వేస్తున్నారు.

ఏడాది వారీగా పసుపు సాగు తీరు

సంవత్సరం	ఎకరాలు
2018-19	40,890
2019-20	40,624
2020-21	34,369
2021-22	33,836
2022-23	21,913

కొంగు చాటున షాడోలు

- అధికారిణుల వెంటే నీడలా భర్తలు
- వసూళ్ల వ్యవహారాలు చక్కబెట్టడమే పరమార్థం
- మండల స్థాయిలో వేళ్లూనుకున్న వింత ధోరణి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భారతీయ సంప్రదాయంలో భార్యాభర్తలు చెరిసగం అనే భావన ఉంది. అయితే ప్రభుత్వ కార్యనిర్వాహణ విధుల్లో సైతం తమకు సగభాగం అన్నవిధంగా కొందరు అధికారిణుల భర్తలు వ్యవహరిస్తున్నారు. భార్యకు ఉద్యోగం ఉంటే చాలు సదరు ఉద్యోగం తమదే అన్నట్లుగా పెత్తనం చెలాయిస్తుండడం విశేషం. జిల్లాలోని పలు మండలాల్లో పనిచేస్తున్న అధికారిణుల భర్తలు విధి నిర్వహణ విషయంలో వాళ్లకు నీడలా ఉంటూ అన్ని వ్యవహారాలు చక్కబెడుతుండడం పట్ల వివిధ రకాలుగా చర్చ జరుగుతోంది. పేరుకు వాళ్ల కారు డ్రైవర్లుగా వస్తూ తామే అధికారులం అన్నవిధంగా ప్రవర్తిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. నీటిపారుదల ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారిణి సహాయ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. ఈమె భర్త వసూళ్ల విషయంలో అన్నీ తానై కథ నడిపిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.

నగరానికి ఆనుకుని ఉన్న మరో మండలంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న మరో అధికారిణి భర్త సైతం ఇదేవిధంగా వ్యవహరిస్తున్నట్లు తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అలాగే మండల సర్వేయర్‌గా ఉన్న ఓ ఉద్యోగి భర్త విచ్చలవిడిగా పెత్తనం చేస్తుండడం విశేషం. ఇతనైతే ఏకంగా సంబంధిత ఉద్యోగి కార్యనిర్వహణ విధుల్లో సైతం ఇష్టం వచ్చినట్లు జోక్యం చేసుకోవడంపై కొందరు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదరు ఉద్యోగి భర్త కావడంతో ఏమీ అనలేని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ఇక వసూళ్ల వ్యవహారం విపరీతంగా చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలోని ఇతర మండలాల్లోనూ ఇలాంటి వ్యవహారాలు యథేచ్ఛగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. తమ భార్యలకు కీలకమైన ఉద్యోగాలు ఉంటే ఇక తమ పని వసూళ్లే అన్నట్లుగా ఉండటం విశేషం. అదే తమ పరమార్థం అన్నట్లుగా ప్రవర్తిస్తుండడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అప్పటివరకు తాము చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలను వదిలేసి తమ భార్యల ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన వ్యవహారాలే తమ ప్రధాన విధులు అన్నవిధంగా వ్యవహరిస్తుండడంపై బహిరంగ విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడం వల్లే మండల స్థాయిలో ఈ విధంగా వ్యవస్థ తయారైనట్లు పలువురు వాపోతున్నారు. భర్తలకు కార్యనిర్వహణ బాధ్యతలను అప్పగించే విధంగా వ్యవహరించే వారికి ఉద్యోగాలు ఎందుకని పలువురు అంటున్నారు. పైగా వసూళ్ల వ్యవహారాలను చక్కబెడుతుండడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్


బీట్ అధికారి శ్రీనివాస్

కామారెడ్డి టౌన్: పొలాలకు వెళ్లేందుకు అటవీ భూమిలోంచి కల్వర్టు నిర్మించుకుంటున్న రైతులను లంచం డిమాండ్ చేసిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఏసీబీకి చిక్కారు. రూ. 20 వేల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ అంగిళ్ల ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలు.. రాజంపేట మండలం ఆర్గొండ అటవీ శివారు ప్రాంతంలో భూములున్న రైతులు.. తమ పొలాల వద్దకు వెళ్లడానికి వీలుగా మట్టితో రోడ్డు వేసుకున్నారు. ఈ దారిలో కొంత అటవీ భూమి కూడా ఉంది. అందులో కల్వర్టు నిర్మించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాజంపేట మండలం కొండాపూర్ అటవీ శాఖ బీట్ ఆఫీసర్ మంత శ్రీనివాస్ అలియాస్ శ్రీను.. పనులను నిలిపివేయాలని రైతులతో పేర్కొన్నాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకుండా ఉండేందుకు రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆర్గొండ మాజీ సర్పంచ్, రైతు తుల సిద్దిరాములు రైతుల తరపున మధ్యవర్తిగా వ్యవహరించి, రూ.20వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. గతంలో సిద్దిరాములు తన కూతురి పెళ్లి సందర్భంలో అడవి నుంచి వంట చెరుకు తీసుకెళ్తుండగా అధికారులు పట్టుకున్నారు. అది ఎందుకూపనికి రానిది కావడంతో వదిలేశారు. ఈ విషయంపై ఇటీవల సిద్దిరాములు ఇంటికి వెళ్లిన సదరు బీట్ ఆఫీసర్.. తాను చెబితేనే వదిలేశారని, ఇప్పుడు కేసు నమోదు చేస్తానని హెచ్చరించాడు. కేసు పెట్టకుండా ఉండడానికి రూ. 40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకపోతే తన ఇంటికోసం డోర్ ఫ్రేం తయారు చేయించి ఇవ్వాలన్నాడు. ఆ అధికారి తీరుతో విసిగిపోయిన సిద్దిరాములు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు చెప్పిన విధంగా కామారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్దనున్న ఓ ఉడిపి హోటల్‌లో బుధవారం రూ.20 వేలను అటవీ అధికారికి అందించాడు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ఆశాజనకంగా భూగర్భజలాలు

- జూన్‌లో వర్షపాతం తక్కువగా నమోదైనా..
- గతేడాది భారీ వర్షాలతో పదిలంగా నీటిమట్టం
- సాగుకు ఇబ్బంది లేదంటున్న శాస్త్రవేత్తలు

మోర్తాడ్: వర్షాకాలం ప్రారంభమైనా ఆశించదగ్గ వర్షపాతం నమోదు కాలేదు. అయినప్పటికి 2022లో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలాలు పదిలంగానే ఉన్నాయి. జూన్‌లో జిల్లాలోని 81 ఫీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల లెక్క తీయగా ఆశాజనకంగానే భూగర్భ జలాలు ఉన్నట్లు స్పష్టమైతుంది. జిల్లాలో సరాసరి నీటిమట్టం 11.53 మీటర్లుగా నమోదైంది. 2022 జూన్‌లో 11.56 మీటర్లుగా ఉండగా ఈసారి నీటి మట్టం మరింత మెరుగ్గా ఉండటం విశేషం. భూగర్భ జలాలు పదిలంగా ఉండటంతో వర్షాకాలం పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూగర్భ జలాలు బాగా లోతులో ఉన్న ప్రాంతాల్లో నీటిని పొదుపుగా వినియోగిస్తే భవిష్యత్తులో ఎలాంటి సమస్య ఉండదని శాస్త్రవేత్తలు సూచించారు. జిల్లాలోని 33 మండలాల్లో 81 చోట్ల ఫీజోమీటర్లు ఉన్నాయి. వీటిల్లో 33 చోట్ల పది మీటర్ల లోతులోనే నీరు ఉంది. 31 చోట్ల 15 మీటర్ల లోతులో నీరు ఉంది. 15 మీటర్ల నుంచి 20 మీటర్ల లోతులో నీరు 10 చోట్ల ఉంది. 7 ప్రాంతాల్లో 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి.


ఏర్గట్ల సబ్‌స్టేషన్‌లో ఉన్న ఫీజోమీటర్

తక్కువ లోతులో నీరు ఉన్న ప్రాంతాలు

గ్రామం	మండలం	నీటి మట్టం (మీటర్లలో)
మచ్చర్ల	ఆలూర్	1.40
నిజాంపూర్	నవీపేట్	1.55
రాణాకలాన్	ఎడపల్లి	1.27
రుద్రూర్	రుద్రూర్	2.97
ఎక్కువ లోతులో నీరు ఉన్న ప్రాంతాలు		
గోనుగొప్పుల	భీమ్‌గల్	27.00
కంఠేశ్వర్	నిజామాబాద్	23.44
చీమన్‌పల్లి	సిరికొండ	20.92
మోపాల్	మోపాల్	20.16
సంగెం	బోధన్	20.08
తాళ్లపల్లి	భీమ్‌గల్	20.65

గంజాయి స్మగ్లింగ్‌లో మహిళలు!

- వారిని తనిఖీ చేయరనే భావన
- నాందేడ్ నుంచి నిజామాబాద్‌కు తరలింపు
- కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా దందా


గంజాయితో పట్టుబడ్డ మహిళలను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆటోనగర్‌లోని షేక్ రోశిదా బేగం, షేక్ ఫరీదా బేగం ఇళ్లలో ఈ నెల 3న పోలీసులు తనిఖీలు చేసి రెండు కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు నాందేడ్ నుంచి గంజాయిని తీసుకొచ్చినట్లు గుర్తించారు. గంజాయి రవాణాపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గట్టి నిఘా పెట్టడంతో స్మగ్లర్లు కొత్త మార్గాలు వెతుక్కుంటున్నారు. గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి మహిళల ద్వారా జిల్లాకు తీసుకొస్తున్నారు. మహిళలను ఎవరు తనిఖీ చేపట్టారని భావించిన గంజాయి వ్యాపారులు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతోపాటు ఆదిలాబాద్ జిల్లా నుంచి జిల్లాకు గంజాయిని తరలిస్తున్నారు. మహిళలపై ఎక్సైజ్, పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు నిఘా లేకపోవడంతో గుట్టచప్పుడు కాకుండా రైళ్లతోపాటు బస్సులు, వాహనాల ద్వారా తరలిస్తున్నారు. గతంలో జిల్లా కేంద్రంలోని కొందరు మహిళలు గంజాయిని చిన్న, చిన్న ప్యాకెట్లుగా యువకులు, కాలేజీ స్టూడెంట్స్‌కు విక్రయించారు. గంజాయిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతోపాటు మంత్రి ప్రశాంత్‌రెడ్డి గంజాయి అమ్మకం దారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గంజాయి అమ్మకం దారులతోపాటు గంజాయి తాగుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

మత్తులోకి యువత

ఎండు గంజాయిని చిన్న, చిన్న ప్యాకెట్‌లో నింపి రూ.300కు ఒకటి చొప్పున అమ్ముతున్నారు. దీంతో యువకులు, విద్యార్థులు సిగరెట్‌లో గంజాయిని కలుపుకొని మత్తులోకి దిగుతున్నారు. నగర శివారు కాలనీలతోపాటు రైల్వేస్టేషన్, టీ హోటళ్లలో గంజాయిని తాగుతున్నారు. ఈ గంజాయి ప్యాకెట్లను మహిళలు అమ్ముతుండటంతో మూడు రోజుల క్రితం ఎక్సైజ్ అధికారులు పక్కా సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నారు.

తనిఖీలు చేపడుతాం

గంజాయిని అరికట్టడానికి మహిళ కానిస్టేబుళ్లతో తనిఖీలు చేపడుతాం. సిబ్బంది తక్కువగా ఉండటంతో పోలీసుల సహకారం తీసుకుంటున్నాం. యువకులు, కాలేజీ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాం. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి పెట్టాలని సూచించారు. కౌన్సెలింగ్ చేసినా గంజాయి మత్తులో ఉన్నవారిపై కేసులు నమోదు చేస్తాం.
– మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

జిల్లాలో గంజాయి కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు	నిందితులు	దొరికిన గంజాయి(కేజీల్లో)
2021	31	48	25
2022	21	29	332.5
2023 జూన్ వరకు	15	18	27.95


గంజాయి ప్యాకెట్లు(ఫైల్)

త్వరలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

- మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి

డిచ్‌పల్లి: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గొప్పదనాన్ని ప్రజలు గుర్తించారని త్వరలోనే పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత బుధవారం తొలిసారిగా డిచ్‌పల్లికి వచ్చిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఇందల్వాయి టోల్‌ప్లాజా నుంచి డిచ్‌పల్లి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాయత్రి ఎన్‌క్లేవ్‌లో విలేకరుల సమావేశంలో అరికెల మాట్లాడారు. టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా మారిన తర్వాత తెలంగాణతో ఆ పార్టీకి సంబంధం లేకుండా పోయిందన్నారు. ప్రాణహిత చేవేళ్ల ప్యాకేజీ 20, 21ని పూర్తి చేయకుండా కాళేశ్వరం పేరుతో ప్రభుత్వం కమీషన్లు దండుకుందని ఆరోపించారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు నిజామాబాద్‌కు రాలేదన్నారు. టీఎస్ ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్‌కు వ్యక్తులు ముఖ్యం కాదని.. రూరల్‌లో ఎవరికి టికెట్ ఇచ్చినా అందరినీ కలుపుకు పోయి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు.


ర్యాలీలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి

డిచ్‌పల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, నవీన్‌గౌడ్, బాల్‌రాజ్, డీసీసీ అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, డీసీసీ డెలిగేట్స్ ధర్మాగౌడ్, వాసుబాబు, శ్యాంసన్, పెద్దోళ్ల శ్రీనివాస్, దేవకరుణ పాల్గొన్నారు.

పోడు భూముల్లో ఇక దర్జాగా సాగు

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: ప్రభుత్వం అందించిన పట్టాలతో పోడు భూముల్లో ఇకపై గిరిజనులు దర్జాగా పంటలు సాగు చేసుకోవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎవరికి భయపడాల్సిన అవసరం గానీ, అణిగి మణిగి ఉండాల్సిన అవసరం లేకుండా భూముల హద్దులతో కూడిన సమగ్ర నక్షాతో ప్రభుత్వం పక్కాగా పట్టా పుస్తకాలను అందిస్తోందని వెల్లడించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం దొమ్మర్ చౌడ్(డీసీ) తండాలో లబ్ధిదారులకు పోడు భూముల పట్టా పాస్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. అమీర్ నగర్ తండా, సర్పంచ్ తండా, డీసీ తండా, కోనాపూర్ కొత్త చెరువు తండా, ఉక్లానాయక్ తండా, సోమిడి రాగిడి తండా, బిలియా నాయక్ తండా, గుడి లింగాపూర్ తండాలకు చెందిన 190 మంది లబ్ధిదారులకు 590 ఎకరాల పోడు భూములకు సంబంధించిన పట్టాలు అందజేశారు. తరతరాలకు జీవనోపాధి కల్పించే ఈ భూములను అమ్ముకోవద్దని సూచించారు. పోడు భూములకు పట్టా పుస్తకాల పంపిణీకి ముందే ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేసిందని మంత్రి అన్నారు. ఇకపై అడవుల జోలికి వెళ్లకుండా వాటి సంరక్షణకు అడవి బిడ్డలుగా చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఆర్డీవో రవి, గిరిజన సంక్షేమాధికారి నాగురావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, జెడ్పీటీసీ రాధ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దేవేందర్ పాల్గొన్నారు.


డీసీతండాలో పోడు భూముల పట్టా పుస్తకాలను అందజేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి 2500 క్యూసెక్కుల వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల 2500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 50 క్యూసెక్కు, ఎస్కేప్ గేట్ల ద్వారా 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా, బుధవారం ప్రాజెక్ట్‌లో 1065.20 (20.55 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థి నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో విద్యార్థులు ప్రమోద్, జయంతి, రమ్య, శ్వేత, అక్షర్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో 11.1 మి.మీ వర్షపాతం నమోదు

సుభాష్‌నగర్: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 11.10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఏర్గట్లలో 65.6 మి.మీ, మెండోరాలో 41.1, బాల్కొండలో 39.4, నందిపేట్‌లో 32.5 మి.మీ వర్షం కురిసింది. రాగల రెండ్రోజులు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని 3 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా.. 15 మండలాల్లో లోటు వర్షపాతం, మరో 15 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో వర్షపాతం ఇలా..

193 మందికి కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం నగరంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. బుధవారం పాలిటెక్నిక్ కళాశాలలో 193 మంది విద్యార్థుల ధృవపత్రాలను అధికారులు పరిశీలించారు. ఈనెల 8 నుంచి కళాశాలలు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: ఒక మహిళను హత్య చేసిన కేసులో నిందితులైన సయ్యద్ హైమద్, బుద్దవాలి దత్తులకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలపై అత్యాచారాల నిరోధక విచారణ న్యాయస్థానం స్పెషల్ జడ్జి శ్రీనివాస్ బుధవారం ముప్పై ఐదు పేజీల తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామానికి చెందిన సయ్యద్ అహ్మద్, పిట్లంలోని శాంతినగర్ వాస్తవ్యుడు బుద్దవాలి దత్తు స్నేహితులు. పిట్లం మండలానికి చెందిన షెడ్యూల్డు తెగల మహిళతో దత్తుకు వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకున్న అహ్మద్, ఆమెతో పరిచయం చేయమని దత్తును కోరాడు. ఈక్రమంలో ఒకరోజు సదరు మహిళతో కలిసి వారు మద్యం సేవించగా, అహ్మద్‌తో ఆమె హేళనగా మాట్లాడింది. దీంతో ఆమెను అతడు హతమార్చాలనుకున్నాడు. 6ఆగస్టు 2021న ఆమెను పిట్లం సమీపంలోని ఎలిమెలికుంట చెరువు దగ్గరలోని చెట్ల మధ్యలోకి తీసుకువెళ్లి, మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ఆమెను అహ్మద్ కత్తితో పొడిచి, గొంతు కోశాడు. దత్తు ఆమెపై గల బంగారు, వెండి నగలు, డబ్బులు తీసుకుని హత్యకు సహకరించాడు. నిందితులపై హత్య, దొంగతనం అభియోగాలు కోర్టులో రుజువు కావడంతో ఇద్దరికీ హత్య కేసులో జీవిత కారాగారం, దొంగతనం కేసులో మూడేళ్ల జైలుశిక్ష విధిస్తు న్యాయమూర్తి శ్రీనివాస్ తీర్పు తెలిపారు.

చేయూతనందించరూ!

- రెజ్లింగ్‌లో రాణిస్తున్న భాను ప్రసాద్, మహేష్
- రెండోసారి అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక
- నేపాల్ వెళ్లడానికి ఆర్థికంగా ఇబ్బందులు
- 2021లో అవకాశాన్ని చేజార్చుకున్న వైనం
- దాతలు సహకరించాలని వేడుకోలు



దాకూరి భాను ప్రసాద్ :
(గూగుల్ పే, ఫోన్ పే): 76749 93878
ఓర్సు మహేష్ :
(గూగుల్ పే, ఫోన్ పే): 93464 32957

ఆర్మూర్: అంతర్జాతీయ క్రీడా వేదికపై మువ్వన్నెల జెండాను ఎగరవేయాలనే సంకల్పంతో ఆరేళ్లుగా రెజ్లింగ్ (కుస్తీ) క్రీడను నేర్చుకుంటూ అహర్నిషలు కృషి చేస్తున్న ఇద్దరు మిత్రులను పేదరికం వెక్కిరిస్తోంది. ఆర్మూర్‌కు చెందిన దాకూరి భాను ప్రసాద్, ఓర్స్ మహేష్ ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి మిత్రులు. పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుడు భూపతిరాజ్ శిక్షణతో వీరి జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకున్నారు. ఆరో తరగతి నుంచే ఇరువురు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ చివరికి అంతర్జాతీయ క్రీడలకు ఎంపికయ్యారు. కానీ పేదరికం కారణంగా ఆగస్టు 1న నేపాల్‌లో నిర్వహించే అంతర్జాతీయ క్రీడల్లో పోటీ పడటానికి స్పాన్సర్స్ కోసం వెతుక్కోవాల్సిన దుస్థితిలో ఉన్నారు.

సాధించిన పతకాలు..

అక్టోబర్ 2019లో తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఇరువురు ప్రతిభ కనబర్చడంతో వీరిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్, రూరల్ గేమ్స్ ఆఫ్ స్టేట్ లెవల్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. 2021 అక్టోబర్‌లో భాను ప్రసాద్ మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించిన రూరల్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో జాతీయ స్థాయిలో 75వెయిట్ క్యాటగిరీలో బంగారు పతకాన్ని కైవసం చేసుకొని అంతర్జాతీయ క్రీడలకు ఎంపికయ్యాడు. కానీ పేదరికం కారణంగా అంతర్జాతీయ క్రీడలకు హాజరు కాలేకపోయాడు. అయినా ధైర్యాన్ని కోల్పోకుండా మిత్రులిద్దరూ 2023లో మళ్లీ తమ ప్రయత్నాన్ని మొదలు పెట్టారు. జూలై 1న గోవాలో నిర్వహించిన రూరల్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో 75 వెయిట్ క్యాటగిరీలో ఓర్స్ మహేష్, 80 వెయిట్ క్యాటగిరీలో దాకూరి భాను ప్రసాద్ బంగారు పతకాలను కైవసం చేసుకొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

కుటుంబాల నేపథ్యం ఇదీ...

ఆర్మూర్ పట్టణంలోని సీఎస్ఐ చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో ఆయా, అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న రమణాబాయి, రమేష్‌లకు ఇద్దరు కొడుకులు కాగా దాకూరి భాను ప్రసాద్ మొదటి వాడు. ఇతను ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. జిరాయత్ నగర్ కాలనీలో కర్రీ పాయింట్ నిర్వహిస్తున్న సుజాతకు కొడుకు మహేష్ కాగా మరో కూతురు ఉంది. ఒంటరిగా కష్టపడుతూ పేదరికాన్ని పిల్లల దరికి చేరనివ్వకుండా తీర్చిదిద్దుతోంది. మహేష్ ప్రస్తుతం పట్టణంలోని సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఇరువురు పేద కుటుంబ నేపథ్యం కారణంగా తమను అంతర్జాతీయ పోటీలకు పంపించడానికి ఆర్థిక సహాయం అందించే ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు.

అంతర్జాతీయ వేదికపై విజేతగా నిలవాలి..



అంతర్జాతీయ వేదికపై రెజ్లింగ్ క్రీడలో విజేతలుగా నిలిచి మువ్వన్నెల జెండాను ఎగరవేయాలనే సంకల్పమే నన్ను ఇంత దూరం తీసుకు వచ్చింది. అంతర్జాతీయ క్రీడా పోటీలకు వెళ్లడానికి ఎవరైనా సహాయం చేస్తే బంగారు పతకాన్ని గెలుచుకువస్తాననే నమ్మకం ఉంది.

– దాకూరి భను ప్రసాద్,
రెజ్లింగ్ క్రీడాకారుడు, ఆర్మూర్

ఇండియా పవర్ చూపించాలి..



అంతర్జాతీయ క్రీడా వేదికపై విజేతగా నిలిచి ఇండియా పవర్ చూపించాలి అనే లక్ష్యంతోనే కష్టపడుతున్నాను. నేపాల్‌లో పోటీ పడి విజేతగా నిలవడానికి అహర్నిషలు ప్రాక్టీస్ చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వమైనా మాలాంటి వారికి అండగా నిలిచి మమ్మల్ని అంతర్జాతీయ క్రీడలకు పంపించే ఏర్పాటు చేయాలి.

– ఓర్సు మహేష్,
రెజ్లింగ్ క్రీడాకారుడు, ఆర్మూర్

మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలోని 29మండలాలకు బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అలాగే మూడు టౌన్‌లకు ముగ్గురు అధ్యక్షులను నియమించినట్లు డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పేరు	మండలం	పేరు	మండలం
సుంకేట రవి	కమ్మర్‌పల్లి	మంద మహిపాల్	నందిపేట్
ముత్యంరెడ్డి	మెండోరా	జి భూమేష్‌రెడ్డి	డొంకేశ్వర్
వెంకటేష్‌గౌడ్	బాల్కొండ	సిహెచ్ రవిప్రకాష్	మాక్లూర్
దేవారెడ్డి	ఏర్గట్ల	బక్కారం రవి	సిరికొండ
బొదిరే స్వామి	భీంగల్	చిన్న బాలరాజు	ధర్పల్లి
గడ్డం నర్సారెడ్డి	వేల్పూర్	ఎం నవీన్‌గౌడ్	ఇందల్వాయి
ముత్యాల రాములు	మోర్తాడ్	ఎల్లయ్య	నిజామాబాద్ రూరల్
ఎం. ముత్యంరెడ్డి	ముప్కాల్	చిన్నారెడ్డి	జక్రాన్‌పల్లి
జెజె నర్సయ్య	భీంగల్ టౌన్	అమృతాపూర్ గంగాధర్	డిచ్‌పల్లి
పులి శ్రీనివాస్	ఎడపల్లి	వై సాయరెడ్డి	మోపాల్
సుధాకర్‌రావు	నవీపేట్	షాహిద్	కోటగిరి
మోబిన్‌ఖాన్	రెంజర్ల	పోతరాజు శ్రీనివాస్	చందూర్
పాషాబాయ్	బోధన్ టౌన్	కొత్తిమీర్‌కార్ లక్ష్మన్	మోస్రా
ఇట్టం జీవన్(ఇన్‌చార్జి)	ఆర్మూర్	సురేష్‌బాబా	వర్ని
ముక్కెర విజయ్	ఆలూర్	తోట అరుణ్‌కుమార్	రుద్రూర్
సాయిబాబాగౌడ్	ఆర్మూర్ టౌన్	పుప్పాల శంకర్	పోంతంగల్

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

సిరికొండ: మండలంలోని న్యావనంది గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై నర్సింలు బుధవారం తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్కన గల గుడిసెలో గల పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుండి రూ. 2700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: యూపీఎస్సీ సివిల్స్‌కు ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఉమ్మడి జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈనెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 16న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 31నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 31వరకు కోచింగ్ ఇస్తామన్నారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు నెలకు రూ. 5000 స్కాలర్‌షిప్. రూ.5000 విలువైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

డొంకేశ్వర్(ఆర్మూర్): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం మృతిచెందాడు. వివరాలు ఇలా.. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన తోకల గంగారాం ఈ నెల 2న చేపలు అమ్మడానికి మోపెడ్‌పై బయలుదేరాడు. నూత్‌పల్లి-డొంకేశ్వర్ రోడ్డు మార్గంలో అతడి మోపెడ్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడగా, స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ట్రాక్టర్‌కు నిప్పు

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టరుకు నిప్పు పెట్టడంతో పాక్షికంగా ధ్వంసమైంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎంబారి లింబయ్య తన ట్రాక్టరును వ్యవసాయ భూమి పక్కన నిలిపాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో బుధవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి అదృశ్యం



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి స్వప్నలోక్లో నివాసం ఉండే పడిగల వీరేశం(45) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ బుధవారం తెలిపారు. వీరేశం మానసిక పరిస్థితి బాగాలేదు. అతడు గత నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. గతంలో చాలాసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. ఈసారి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ఎర్ర కావ్య(25) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ఎర్ర మనోజ్‌తో నిజామాబాద్‌కు చెందిన కావ్యకు రెండున్నరేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇంకా సంతానం కలుగలేదు. కాగా బుధవారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బలవన్మరణానికి గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి తండ్రి రాజు తన కూతురి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్కూటీని ఢీకొట్టిన బైక్: ముగ్గురికి గాయాలు

మాచారెడ్డి: మండలంలో బుధవారం స్కూటీని బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మాచారెడ్డి ఇన్‌చార్జి ఏఎస్సై రామేశ్వరరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఘన్పూర్ గ్రామానికి చెందిన మామిడాల హరీష్ ఆయన తల్లి లక్ష్మీదేవి బుధవారం స్కూటీపై కామారెడ్డి బయలుదేరారు. భవానీపేట్, ఆరేపల్లి గ్రామాల మధ్య గల రోడ్డుపై సందీప్ అనే వ్యక్తి బైక్‌తో వెనక నుంచి వీరి స్కూటీని ఢీకొట్టారు. దీంతో సందీప్‌తో పాటు లక్ష్మీదేవి, హరీష్లకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిని చికిత్స నిమిత్తం స్థానికులు కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

నాటు సారా పట్టివేత



సిరికొండ: మండలంలోని వివిధ తండాలలో బుధవారం దాడులు నిర్వహించి నాటు సారా, నల్లబెల్లం, పటిక పట్టుకున్నట్లు భీంగల్ ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ తెలిపారు. గోప్య తండాలో సేవాలాల్ కిరాణ దుకాణంలో గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్న 440 కిలోల నల్లబెల్లం, 165కిలోల పటికను స్వాధీనం చేసుకొని దుకాణ యాజమాని రూప్‌సింగ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే నడిమితండా, లొంక తండా, మెట్టు తండా, సర్పంచ్ తండా, గోప్యానాయక్ తండా, కొండాపూర్‌లో దాడులు నిర్వహించి గుడుంబా తయారీ చేస్తున్న వ్యక్తులను పట్టుకొని ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సిబ్బంది ఫయాజ్, మహేష్, దత్తాద్రి, శిరీష పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు..

సిరికొండ: మండలంలోని గడ్డమీది తండాకు చెందిన బానావత్ రాంచందర్ అనే వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు బుధవారం తెలిపారు. రాంచందర్‌పై అతడి భార్య లక్ష్మి, కొడుకు అశోక్‌లు దాడి చేయడంతో తల పగిలి గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కూరగాయల డీసీఎం బోల్తా

- ఇద్దరికి గాయాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని పూణే నుంచి కామారెడ్డి పట్టణానికి కూరగాయలతో బయలుదేరిన డీసీఎం వాహనం బోల్తా పడింది. డ్రైవర్, మరొకరికి గాయాలు అయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని నడపడంతో రోడ్డు కిందకి వాహనం దిగి బోల్తా పడింది. వాహనంలోని పచ్చిమిర్చి, క్యాబేజీ, క్యాప్సికం బస్తాలు కొన్ని ధ్వంసం కాగా, మరికొన్ని కూరగాయలను స్థానికులు తీసుకెళ్లారు. దీంతో రూ.లక్షా వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మిగత కూరగాయలను ఇతర వాహనాల్లో కామారెడ్డికి తరలించారు. దీంతో రెండు గంటల పాటు రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

నా కొడుకును బతికించండి..

- తొమ్మిదేళ్ల సాత్విక్‌కు కిడ్నీ సంబంధిత వ్యాధి
- వైద్యానికి రూ.25లక్షలు అవసరం
- ఆపన్నహస్తం కోసం తల్లి ఎదురుచూపులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాత్విక్

కామారెడ్డి రూరల్: రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఉన్న ఓ నిరుపేద తల్లి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న తన కొడుకును బతికించుకోవడానికి ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. కామారెడ్డి మండలంలోని గూడెం గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల సాత్విక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. తండ్రి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. తల్లి జ్యోతి బీడీలు చుడుతూ జీవనం సాగిస్తోంది. తన కొడుకుకు మెరుగైన వైద్యం అందించాలంటే రూ.25లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొన్నట్లు తల్లి తెలిపింది. వారిది అత్యంత నిరుపేద కుటుంబం కావడంతో దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేస్తే నా కుమారుడు బతికే అవకాశం ఉందని ఆమె కన్నీళ్ల పర్యంతమవుతూ వేడుకుంటుంది.

అకౌంట్ నెంబర్ 62377650471
ఐఎఫ్‌సీ కోడ్‌నెం:SBHY0020111
ఎస్‌బిఐ బ్యాంక్, సిరిసిల్ల రోడ్, కామారెడ్డి శాఖ
ఫోన్ పే: 9346502185

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం



దోమలేడ్గిలో ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

రుద్రూర్: ఆరోగ్య వంతమైన సమాజమే లక్ష్యంగా వైద్యసేవలు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని కొల్లూర్, దోమలేడ్గి, యాద్‌గార్‌పూర్ గ్రామాల్లో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలతో ఉన్న నిరుపేదలపై ఆర్థికభారం పడకుండా ప్రభుత్వాస్పత్రులను విస్తరించి, మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఏ పని చేయలన్నా ఉమ్మడి రాష్ట్రంలో నిధుల కొరత తీవ్రంగా ఉండేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నిధులు పుష్కలంగా కేటాయిస్తున్నారని అన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు జయరాణి, విజయ, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ శంకర్ పటేల్, రైతుబంధు మండల అధ్యక్షుడు కిశోర్, ఏఎంసీ చైర్మన్ హమీద్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీటీసీ విఠల్ పాల్గొన్నారు.

సాలూరలో అగ్ని ప్రమాదం

- దగ్ధమైన పెంకుటిల్లు
- రూ.4లక్షల ఆస్తినష్టం



బోధన్: సాలూర మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఉస్కే చిన్న గంగారాం అనే వ్యక్తి పెంకుటింట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. పొగలు బయటకు రావడంతో కాలనీ వాసులు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఇంటి యాజమాని గంగారాంకు సమాచారం ఇచ్చారు. పెంకుటిల్లు పాక్షికంగా దగ్ధం కాగా, నిత్యావసర సరుకులు, దుస్తువులు, నగదు, బంగారు, వెండి నగలు, పట్టా పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డులు, ఇతర డ్యాకుమెంట్లు కాలిపోయాయి. రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఫైరింజన్ ఇరుకు రోడ్డు ఉండటం వల్ల ఘటన స్థలానికి వెళ్లడానికి వీలులేకుండాపోయింది. సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు.

నగరంలోని ఫర్నిచర్ దుకాణంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలోని మాజీ ఎమ్మెల్యే కిసాన్‌దాస్ కాంప్లెక్స్‌లో సోఫా, ఫర్నిచర్ వర్క్‌షాప్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలు అర్పివేశారు. రూ. 2లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, కానిస్టేబుళ్లు నర్సయ్య, ప్రశాంత్‌గౌడ్, ఏసురత్నం తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో మున్సిపల్ ఉద్యోగి ఆత్మహత్య



మద్దెల లక్ష్మణ్ (ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బల్దియాలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఏకచక్రనగర్ కాలనీకి చెందిన మద్దెల లక్ష్మణ్, బోధన్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం అప్పులు చేసి ఇల్లు కట్టాడు. చేసిన అప్పులు కట్టలేక బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సబిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎడపల్లిలో వీఆర్ఏ..



నాగరాజు (ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో బుధవారం తహసీల్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న దేవా నాగరాజు(36) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా.. నెల రోజులుగా నాగరాజు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో మానసిక ఆందోళన చెందేవాడు. ఇంట్లో ఎవరికీ కారణం చెప్పకపోయేవాడు. ఈక్రమంలో బుధవారం మానసిక ఆందోళనకు గురై ఇంట్లో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు.

రిలయన్స్ స్టోర్‌కు రూ.2వేల జరిమానా

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రిలయన్స్ సూపర్ స్టోర్‌లో కుళ్లిన ఫ్రూట్ జ్యూస్ విక్రయించినందుకు మున్సిపల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ రూ. 2 వేల జరిమానా విధించారు. వివరాలు ఇలా.. రిలయన్స్ స్టోర్‌లో బుధవారం ఓ కొనుగోలుదారుడు ఫ్రూట్ జ్యూస్ బాటిల్‌ను కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి, బాటిల్ మూత తీయగా జ్యూస్ కుళ్లిపోయి, ఫంగస్ పట్టింది. వెంటనే అతడు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు మార్ట్‌కు చేరుకొని మార్ట్‌లో గల ఫ్రూట్ జ్యూస్ బాటిల్స్ తనిఖీ చేశారు. ఇలాంటి వస్తువులు అమ్మరాదని హెచ్చరించి, జరిమానా విధించి, నిజామాబాద్ ఫుడ్ సెఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.